క్లుప్తంగా

ఎస్సైకి సన్మానం



వర్ధన్నపేట : స్థానిక ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన నంద్రు సాయిబాబును ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యులు ఈరెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం శాలువాతో సన్మానించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వరమే న్యాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎలికట్ట ప్రభాకర్, నాయకులు ఇలబెల్లి అబ్రహం, ఇలబెల్లి సురేందర్ తదితరులు పాల్గొన్నారు

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



కొమురెల్లి (ఫైల్)

సంగెం : మద్యం మత్తులో పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని కుంటపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కావటి కొమురెల్లి (58) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయన ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 3న కింద మద్యం మత్తులో గడ్డి మందు తాగి పడిపోయాడు. కుటుంబీకులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య కొమురమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

'బర్రెల విక్రేతలపై చర్యలు తీసుకోవాలి'

నల్లబెల్లి : తప్పిపోయి గ్రామానికి వచ్చి బర్రెలను అక్రమంగా విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని గొల్లపల్లి గ్రామ పెద్దలు సంఘ ఐలయ్య, కుంట రాజకొమురయ్య, ఎర్ర కిష్టయ్య, కడుదూరి నర్సయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం వారు విలేకరులకు వివరాలు వెల్లడించారు. రెండు నెలల క్రితం నాలుగు బర్రెలు తప్పిపోయి గ్రామంలోకి రాగా కొందరు వాటిని పెంచుకున్నారని, యజమానులు రావడం లేదనే సాకుతో మూడింటిని ఇటీవల సంతకు తరలించి అమ్ముకుని సొమ్ము చేసుకున్నారని తెలిపారు. సదరు బర్రెలను యజమానులను గుర్తించి అప్పగించాలని పంచాయతీ కార్యదర్శికి చెప్పినా పట్టించుకోలేదన్నారు. మూడు బర్రెలను అమ్ముకున్న వారిపై చర్యలు తీసుకుని వాటి యజమానులను గుర్తించి న్యాయం చేయాలని కోరారు.

నివాళి



నర్సంపేట : పట్టణానికి చెందిన శీరంశెట్టి సాంబయ్య శుక్రవారం మృతి చెందగా ఆయన మృతదేహానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డ్యాగల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ ఎలకంటి విజయ్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుమారుడైన సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు రాజేందర్‌ను, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యామ్‌కుమార్, నాయకులు మర్రి క్రాంతికుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలో..



పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన ఆకుతోట వెంకటేశ్వర్లు మృతి చెందగా ఆయన మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు, ఐలోని దేవస్థానం డైరెక్టర్ వెంకన్న యాదవ్, తదితరులు వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

బియ్యం, నగదు సాయం

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని జల్లి గ్రామానికి చెందిన నాంపల్లి చిన్న నర్సయ్య ఇటీవల మృతి చెందగా స్థానిక పోచమ్మవాడకు చెందిన వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బాధిత కుటుంబానికి క్వింటా బియ్యం, కొంత నగదు సాయంగా అందజేశారు. తొలుత చిన్న నర్సయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు తండ రాజు గౌడ్, సభ్యులు నాంపల్లి శ్రీకాంత్, తండ రమేశ్, బస రోహిత్, నాంపల్లి రవికుమార్, తండ సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట : గణనాథుడి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది



నల్లబెల్లి : విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న తహసీల్దార్ కృష్ణ, భక్తులు



నర్సంపేట : దామెర చెరువులో నిమజ్జనమవుతున్న గణనాథుడి విగ్రహాలు





భక్తిశ్రద్ధలతో గణనాథుల నిమజ్జనం

జిల్లావ్యాప్తంగా శుక్రవారం భక్తులు, ఉత్సవ కమిటీల నిర్వాహకులు గణనాథులను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. డప్పుచప్పుళ్లు, కోలాటాలతో విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. చెరువులు, కుంటలు, ఇతర జలాశయాల్లో నిమజ్జనం చేశారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కుటుంబీకులతో కలిసి ఇంట్లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాన్ని తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

\- సాక్షి నెట్‌వర్క్



నర్సంపేట రూరల్ : గణనాథుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భక్తులు



నల్లబెల్లి : గణనాథుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న ఉత్సవ నిర్వాహకులు, భక్తులు



నర్సంపేట : గణనాథుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి, కుటుంబీకులు



దుగ్గొండి : రాజ్యతండాలో కోలాటాలతో విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు



ఖానాపురం : గుండ్లబజార్‌లో గణనాథుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



నర్సంపేట : నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద, అధికారులు

ఘనంగా గురుపూజోత్సవం



పర్వతగిరి : ఉత్తమ ఉపాధ్యాయులతో తహసీల్దార్, ఎంపీడీఓ

నర్సంపేట/నర్సంపేట రూరల్/రాయపర్తి/పర్వతగిరి : భారతదేశ తొలి ఉప రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని నర్సంపేట, చెన్నారావుపేట, రాయపర్తి, పర్వతగిరి, తదితర మండలాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు, కళాశాలలు, విద్యాసంస్థలో శుక్రవారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. నర్సంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్‌ను, స్కూళ్లు, విద్యాసంస్థల్లో ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ గాయపు లింగారెడ్డి, తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీఓ శంకర్‌నాయక్, తదితరులు ప్రసంగించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. సమాజంలో ఉపాధ్యాయుల పాత్రను, ప్రాశస్త్యాన్ని వివరించారు.



నర్సంపేట : పట్టణంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు



రాయపర్తిలో..

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం

వర్ధన్నపేట : కేంద్ర ప్రభుత్వం పలు నిత్యావసర వస్తువులపై జీఎస్టీని తగ్గించడాన్ని హర్షిస్తూ ఎస్సీ మోర్చా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ, శ్రీధర్ మాట్లాడారు. దేశ చరిత్రలో గతంలో ఎన్నడూ లేనంతగా అనేక నిత్యావసర వస్తువులపై జీఎస్టీని 5 శాతానికి తగ్గించారని, కొన్నింటికి పూర్తిగా మినహాయించారని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండేటి సత్యం, మాజీ మండల అధ్యక్షుడు రాయపురపు కుమారస్వామి, మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు నాంపల్లి యాకయ్య, మాజీ పట్టణ అధ్యక్షుడు పెద్దూరి రాజ్‌కుమార్, నాయకులు బోయినపల్లి దేవేందర్ రావు, ఐత రవి, తేజనాయక్, శ్రీనివాస్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కొండేటి శ్రీధర్, నాయకులు

'ఎన్నికల్లో సత్తా చాటాలి'

నర్సంపేట : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి సత్తా చాటాలని ఆ పార్టీ చెన్నారావుపేట మండల అధ్యక్షుడు సిద్దన రమేశ్ కోరారు. ఆ మండలంలోని బాపునగర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో తొలుత పార్టీ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాదావత్ రాజేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జాటోతు బాలు, ప్రధాన కార్యదర్శిగా భూక్య రాజుతోపాటు కమిటీని ప్రకటించారు. అనంతరం రమేశ్ మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటాం

రాయపర్తి : బీఆర్‌ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని జిల్లా నాయకుడు, ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని వాంకుడోతుతండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు భూక్య నవీన్, కార్యకర్తలు వాంకుడోతు సుమన్, సురేందర్, సమ్మయ్య, నర్సింహ, తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి శ్రీనివాస్‌రెడ్డి కండువాలు కప్పి మాట్లాడారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. అనంతరం గణేష్‌కుంటతండా, మైలారం చక్రుతండా, పానిశ్‌తండాలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో డీజే బాక్స్‌లు అందజేశారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూక్య సురేందర్ రాథోడ్, నాయకులు లేతాకుల సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'జీఓను రద్దు చేయాలి'

నల్లబెల్లి : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక జీఓను రద్దు చేయాలని రైతు సంఘం జిల్లా నాయకుడు కడియాల వీరాచారి డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రైతు వ్యతిరేక జీఓ ప్రతులను శుక్రవారం దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీరాచారి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో పంటలకు సరైన మద్దతు ధర లభించక రైతుల ఆత్మహత్యలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. ప్రధాని మోదీ కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చే దిశగా పని చేస్తున్నారని ధ్వజమెత్తారు. రైతులు పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బొడిగె సమ్మయ్య, కడియాల మనోహర్, భూస రామ్మూర్తి, భూస సదయ్య, పరిపాటి రవి, బూస రాజయ్య, మంద రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల బంద్ విజయవంతం

నెక్కొండ : మండలంలో శుక్రవారం డీలర్లు రేషన్ షాపుల బంద్ విజయవంతం అయ్యింది. అన్ని గ్రామాల్లోనూ డీలర్లు రేషన్ షాపులను బంద్ చేసి నిరసన తెలిపారు. మండల కేంద్రంలోని రేషన్ షాపు ఎదుట రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గోరంట్ల వెంకటనారాయణ మాట్లాడారు. పలువురు రేషన్ డీలర్లు సుమారు 40 ఏళ్లుగా సేవలు అందిస్తున్నారని తెలిపారు. డీలర్లకు రూ.5 వేల గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న కమీషన్ సైతం 5 నెలలుగా పెండింగ్‌లో ఉందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతినెలా ఒకేసారి కమీషన్ చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఎడ్ల లక్ష్మినారాయణ, నాయకులు జనగాం వెంకటనారాయణ, జల్లి బుచ్చయ్య, వ్యాగానాయక్, మహేందర్, సుబ్బారావు, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.



రేషన్ షాపు ఎదుట నిరసన తెలుపుతున్న డీలర్లు

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

మురుగునీటితో దోమల వృద్ధి

- నివారణ చర్యలు శూన్యం

నల్లబెల్లి : మండల కేంద్రమైన నల్లబెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మురుగునీరు చేరింది. మురుగు కాలువ నుంచి నీరు రోజుల తరబడి బయటకి వెళ్లకపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దానికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు మురుగు నీరంతా పంచాయతీ కార్యాలయ ఆవరణలోకి చేరి నిలిచింది. సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోనూ గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ స్కూళ్లు, కార్యాలయాల ఆవరణల్లో ఇదే దుస్థితి నెలకొందంటే అతిశయోక్తి లేదు.

మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వర్షాకాలం నేపథ్యంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచింది. పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో ప్రజలు దోమలతో ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల్లోని ఖాళీ స్థలాలే కాకుండా మురుగు కాలువలు, నీటి నిల్వ ఉన్న ప్రాంతాలు దోమలకు ఆవాసాలుగా మారాయి.



నల్లబెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిల్వ ఉన్న మురుగునీరు

ఏటా వానాకాలంలో పారిశుద్ధ్య పనులతోపాటు దోమల నివారణకు పంచాయతీ అధికారులు ఫాగింగ్ చేపట్టే పరిస్థితి ఉండేది. కాగా ప్రస్తుత వానాకాలంలో ఇప్పటి వరకు ఏ గ్రామంలోనూ ఫాగింగ్ చేయించిన దాఖలాల్లేవు. పంచాయతీల పాలకవర్గ పదవీ కాలం ముగిసి 20 నెలలు పూర్తయ్యాయి. ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టిన తొలి రోజుల్లో పారిశుద్ధ్య పనులు కొంత మేరకు పర్యవేక్షించినా, తదనంతరం గాలికొదిలేశారన్న అపవాదు ఉంది. పంచాయతీలకు నిధుల లేమి సైతం సమస్యలకు కారణమని చెప్పక తప్పదు. గ్రామాల్లోని మురుగు కాలువల్లో పూడిక తీయడం లేదు. రోజుల తరబడి డ్రైనేజీల్లో మురుగునీరు నిల్వ ఉండడం, ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పలు పల్లెల్లోని ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించడం లేదు. పలు గ్రామాల్లో నీరు నిల్వ ఉండడంతో దోమలు విజృంభిస్తుండడంతో ప్రజలు మలేరియా, డెంగీ, తదితర విషజ్వరాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం, పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పల్లెల్లో పారిశుద్ధ్య, దోమల నివారణ పనులు చేపట్టేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షాలకు నీటి నిల్వలు



వర్షాలతో గ్రామంలో నీటి నిల్వలు చోటు చేసుకుని దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. పలు కాలనీల్లో చిన్నారులు, వృద్ధులు సత్వరమే ఆరోగ్యం దెబ్బతిని ఆస్పత్రుల పాలవుతున్నారు. మలేరియా, డెంగీ వంటి జ్వరాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పారిశుద్ధ్య, ఇతర సమస్యల పరిష్కారానికి పంచాయతీ అధికారులు చొరవ చూపాలి.

\- బాదావత్ రాజేందర్, మేడపల్లి

దోమల నివారణకు కృషి



గ్రామాల్లో దోమల నివారణ చర్యలు చేపడతాం. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేసేలా పర్యవేక్షిస్తాం. మురుగు నీటి తొలగింపు పనులు చేయిస్తాం. క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయిస్తాం. పారిశుద్ధ్య పనులపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పిస్తాం. ఖాళీ స్థలాల్లోని పిచ్చిమొక్కలు వెంటనే తొలగించేలా యజమానులకు నోటీసులు అందజేస్తాం.

\- పసరగొండ రవి, ఎంపీడీఓ

వేడుకగా మిలాద్ ఉన్ నబీ



రక్తదానం చేస్తున్న యువకులు

నర్సంపేట : మహ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని పట్టణంలో జమా మస్జిద్ కమిటీ, జమాతే బహార్ దర్గా కమిటీ, తాజ్ ఖుర్షీదియా యూత్ కమిటీ, అల్ మదీనా యూత్ కమిటీల ఆధ్వర్యంలో జష్నే ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. అన్నదానం చేశారు. సుమారు 20 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జమా మజీద్‌కమిటీ అధ్యక్షుడు మిర్జా మసూద్ అలీ బేగ్ మాట్లాడారు. మహ్మద్ ప్రవక్త జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని జీవితంలో సేవా భావంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మత పెద్దలు మౌలానా, షాహీద్ రజా, మౌలానా ఇమ్రాన్, మౌలానా మహబూబ్, యాకూబ్, ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.